క్లుప్తంగా

సాయిబాబా విగ్రహావిష్కరణ



బాబా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): షిర్డీ సాయిబాబాను భక్తితో సేవిస్తే కష్టాలు తీరుతాయని రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. మధురానగర్ మెయిన్‌రోడ్డులోని సాయిబాబా మందిరం లెండీ వనంలో గురువారం బాబా విగ్రహావిష్కరణ చేశారు. మందిర గౌరవాధ్యక్షురాలు, మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీతులసితో కలిసి ఎమ్మెల్యే.. సాయినాథుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. తొలుత విగ్రహ దాతలు దేవిరెడ్డి శివమల్లారెడ్డి, శకుంతల దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో కార్పొరేటర్ పెనుమత్స శిరీష, ఏపీఎస్‌జీఓ నాయకులు పీవీఎల్ఎన్‌రాజు, వైఎస్సార్ సీపీ నగర అధికార ప్రతినిధి కంభం కొండలరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు వైవీ శివాజీ, బాలవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా రోడ్ల నిర్మాణం



పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 63వ డివిజన్ డాక్టర్స్ కాలనీలో తారురోడ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.20 కోట్లతో నాలుగు బిట్లుగా ఉన్న 1.06 కిలోమీటర్ల మేరకు తారు రోడ్డును నిర్మిస్తున్నట్టు వీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్ తెలిపారు. వీటితో పాటు 276 సచివాలయం ప్రాంతంలో తారురోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

ఇన్సూరెన్స్ రంగంలో విద్యార్థులకు అవకాశాలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇన్సూరెన్స్ రంగంలో అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ గుడివాడ శాఖ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీనాథ్ అన్నారు. కేబీఎన్ పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యాన 'ఇన్సూరెన్స్ రంగంలో ఎంబీఏ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు' అంశంపై సదస్సును గురువారం ఆ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారు. శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో ఏర్పాటు చేసే ఇన్సూరెన్స్ కంపెనీలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోనే పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి వ్యక్తి ఇన్సూరెన్స్ తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. విద్యార్థులు ఈ రంగంలో అంశాలపై పట్టు సాధించాలని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు వివిధ రంగాల్లో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, పీజీ విభాగాధిపతి ఎస్ వెంకటేష్, అధ్యాపకులు ప్రభాకర్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మల్లేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ అధికారులను ఆదేశించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న పనులను గురువారం చైర్మన్, ఈఓ, ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. క్యూలైన్లు, మంచినీటి సదుపాయంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలని సూచించారు. ప్రత్యేకంగా క్యూలైన్లతో పాటు షామియానాలు ఏర్పాటు చేయనున్నామని ఈఈ కోటేశ్వరరావు పేర్కొన్నారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టే ప్రాంతంలో సిబ్బందితో మాట్లాడారు. కాయలు కొట్టేందుకు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, చర్యలు తప్పవని చైర్మన్ రాంబాబు హెచ్చరించారు.

కారు ఢీ కొని గాయాలు

పాయకాపురం(విజయవాడరూరల్): ద్విచక్ర వాహనాన్ని ఆపి ఫోను మాట్లాడుతున్న వ్యక్తిని వెనుకనుంచి వచ్చిన కారు ఢీ కొన్న ఘటనలో వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నున్నలో మటన్‌షాపులో పనిచేస్తున్న పఠాన్ ఖాజాఖాన్ ఈ నెల 15న నున్న నుంచి విజయవాడ వెళ్లూ మోటారు సైకిల్ ఆపి ఫోను మాట్లాడుతున్నాడు. అక్కడ గ్యాస్ కంపెనీ వద్ద వెనుక నుంచి వచ్చిన కారు అతన్ని ఢీ కొట్టింది. సంఘటనలో అతని కుడి కాలికి గాయమైనట్టు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శివాలయాలు ముస్తాబు



విద్యుత్ దీపాల వెలుగులో ముత్యాలంపాడులోని స్వామివారి విగ్రహం



విద్యుత్ దీపాల అలంకరణలో ఉభయ రామలింగేశ్వరస్వామి దేవాలయం

మహాశివరాత్రి వేడుకలకు శివాలయాలు ముస్తాబవుతున్నాయి. మందిరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈనెల 18వ తేదీ శనివారం మహాశివరాత్రి వేడుకల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు ఆలయ కమిటీల ఆధ్వర్యాన చురుగ్గా సాగుతున్నాయి. మధురానగర్‌లోని శ్రీ ఉభయ రామలింగేశ్వరస్వామి దేవాలయం, అయోధ్యనగర్‌లోని శ్రీ దత్తసాయి శివకామేశ్వరీపీఠం, ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం, సత్యనారాయణపురం రైల్వేకాలనీలోని శివకేశవ ఆలయంలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయోధ్యనగర్‌లోని శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శనివారం తెల్లవారుజాము నుంచి శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన మహాశివరాత్రి వేడుకలు ప్రారంభమవుతాయని పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ తెలిపారు.

– మధురానగర్(విజయవాడసెంట్రల్)

ప్రతి హామీని అమలుచేస్తున్న జగనన్న

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- 58వ డివిజన్ 258వ వార్డు సచివాలయ పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణు, డిప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి మన జగనన్నే అని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్‌లోని 258వ వార్డు సచివాలయం పరిధిలో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన సింగ్‌నగర్ పైపుల రోడ్డు సమీపంలోని బ్రహ్మంగారి వీధి, నెమలి బిల్డింగ్ రోడ్డు ప్రాంతాల్లో 274 గడపలను సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే విష్ణు మీడియాతో అ అన్ని ప్రాంతాల అభివృద్ధిని కాంక్షిస్తూ పరిపాలన వికేంద్రీకరణ దిశగా ఈ ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు.

చంద్రబాబు సిగ్గుపడాలి

తాత్కాలిక రాజధాని అమరావతి అని చెప్పిన చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో కనీసం పునాదులు కూడా వేయలేకపోయారని, దీనికి చంద్రబాబు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పుడు కనీసం పెన్షనర్లకు సకాలంలో ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేని చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే ఇంటికి రెండు పెన్షన్లు ఇస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ప్రజాదరణ ఆనందాన్ని ఇస్తోంది: డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో ఇంటింటికీ వెళ్తుంటే ప్రజలు మాకు అమ్మ ఒడి వచ్చింది, మాకు సొంత ఇల్లు వచ్చింది, మా పిల్లలు ఉచితంగా ఉన్నత చదువులు చదువుకుంటున్నారు, మాకు ఠంచనుగా పెన్షన్ వస్తుందని చెబుతుంటే చాలా ఆనందంగా ఉందని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ తెలిపారు. 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి, సీడీఓ జగదీశ్వరి, కార్పొరేషన్ డీఈలు రామకృష్ణ, గురునాథం, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, అలంపూరు విజయ్, బెజ్జం రవికుమార్, తోపుల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన సేవలు

జేసీ శ్రీవాస్‌నుపూర్ అజయ్



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న జేసీ శ్రీవాస్‌నుపూర్‌అజయ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్‌అజయ్ కుమార్ అన్నారు. అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. గురువారం నగరంలోని అయ్యప్ప నగర్, అశోక నగర్, గురునానక్ నగర్ సచివాలయాలను జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వార్డు సచివాలయ పరిధిలో ప్రజల నుంచి అందే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను సకాలంలో లబ్ధిదారులకు అందించడానికి సచివాలయ సిబ్బంది. విధులు నిర్వర్తించాలని చెప్పారు. సచివాలయంలో సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్, ఉద్యోగుల మూమెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్, ఎస్ఎల్ఏ గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక, ప్రభుత్వ పథకాల పోస్టర్లు తదితర వాటిని జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ పరిశీలించారు. ఇప్పటివరకు సచివాలయాలకు వచ్చిన సమస్యలు, పరిష్కరించిన వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల పరిసరాల్లో పచ్చదనాన్ని పెంచుతూ పరిశుభ్రతను పాటించాలన్నారు.

ఎస్ఆర్ఆర్ విద్యార్థికి అభినందన



జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికైన దుర్గాప్రసాద్‌తో ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): కాకినాడలో జరిగిన స్టేట్‌మీట్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో ఎస్ఆర్ఆర్ కళాశాల విద్యార్థి దుర్గాప్రసాద్ ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో వ్యాయమవిద్య విభాగం ఆధ్వర్యాన దుర్గాప్రసాద్‌ను సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థి 58 – 63 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించడం కళాశాలకే గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, డాక్టర్ డి. యుగంధర్ కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని దుర్గాప్రసాద్‌ను అభినందించారు.

పుస్తక ప్రియుల జాతర

పుస్తక ప్రియుల రాకతో నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణం జాతరగా మారింది. పుస్తక మహోత్సవ ప్రాంగణంలోని స్టాళ్లు పిన్న, పెద్దతో సందడిగా కనిపించాయి. వారు పుస్తకాలు ఆసక్తిగా గమనించారు. అవసరమైన పుస్తకాలను కొనుగోలు చేశారు. సాహితీ సదస్సులు, పుస్తకావిష్కరణలు జరిగాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



న్యూస్ పేపర్‌తో వినూత్నంగా డ్రస్



ఆర్చరీలో నలంద విద్యార్థి ప్రతిభ



ఆర్చరీ నేషనల్స్ ప్రథమ బహుమతిని అందుకున్న త్రినాథ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో నగరంలోని నలంద విద్యానికేతన్ విద్యార్థి పెండ్యాల త్రినాథ్‌చౌదరి సత్తాచాటి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ నెల 10,11,12 తేదీల్లో ఢిల్లీలోని యమున స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫైనల్ ఎన్టీపీసీ నేషనల్ ర్యాంకింగ్ ఆర్చరీ టోర్నమెంట్ 2022 విలువిద్య పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్ కాంపౌండ్ బాలుర విభాగంలో నలంద విద్యానికేతన్‌లో 11వ తరగతి చదువుతున్న త్రినాథ్ ఓల్గా ఆర్చరీ అకాడమీ క్లబ్ నుంచి పాల్గొని జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా యూనియన్ ట్రైబల్ వెల్ఫేర్ మినిస్టర్ అర్జున్ ముండా, ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ ప్రమోద్ చందూర్కర్ నుంచి బహుమతిని అందుకున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మా విద్యార్థి పోటీల్లో 1వ ర్యాంక్ పొందడం గర్వకారణంగా ఉందన్నారు. కోచ్ నవీన్‌కుమార్‌ను అభినందించారు. స్కూల్ యాజమాన్యం, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది త్రినాథ్‌ను అభినందించారు.

పట్టుదలతో సాగితే విజయం సొంతం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు పట్టుదలతో ముందుకు సాగితే విజయం సొంతమవుతుందని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల యువజన సర్వీసుల శాఖ అసిస్టెంట్ మేనేజర్ ఎస్.నాగేశ్వరరావు అన్నారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యాన గురువారం వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ అనే అంశంపై కొత్తపేటలోని హిందూ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచి స్నేహితులు, ఆలోచనలు విద్యార్థులను విజయం వైపు నడిపిస్తాయని చెప్పారు. మానసిక వికాస నిపుణులు ఏఎం జయరత్నం, శ్రీపతి జగదీష్ మాట్లాడుతూ లక్ష్యసాధనకు కోపం, అసూయ, బద్ధకం, ప్రతీకారం వంటి విషయాలను విడిచి పెట్టాలన్నారు. జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి మాత్రమే చరవాణిని వాడాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు ఆనందకుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం సబ్‌స్టేషన్ 11కేవీ గులాబీతోట ఫీడర్ పరిధిలో కరెంట్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి. సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పున్నయ్య కాలనీ, సాయి ప్రసన్న వీధి, నేతాజీ స్ట్రీట్, సాయిబాబా, గణపతి స్ట్రీట్, కూనపురెడ్డి వారి వీధి, మోహనగాంధీ వీధి, కూనపురెడ్డి సుబ్బారెడ్డి వీధి, కాకర్లమూడి వారి వీధి, బొమ్మసాని వారి వీధి, భానునగర్ ఒకటో లైన్, రెండో లైన్, అమర్ మెడికల్ షాప్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ శ్రీనగర్‌కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన మరమ్మత్తుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్డు, శ్రీనగర్ కాలనీ రెండోలైన్ నుంచి 5వ లైన్ వరకు, టీచర్స్‌కాలనీ మొత్తం ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

నేడు బీఎస్ఆర్‌కేలో స్పోర్ట్స్ మీట్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లోని తమ స్కూల్లో శుక్రవారం స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామని బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ కె.నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే స్పోర్ట్స్ మీట్‌కు కలెక్టర్ ఢిల్లీరావు, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్, ఎన్టీఆర్ జిల్లా డీఈవో సీవీ.రేణుక తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

ఇంగ్లిష్ భాషపై అవగాహన అవసరం

గుణదల (విజయవాడ తూర్పు): ప్రతి ఒక్కరూ ఇంగ్లిషు భాష పై అవగాహన పెంపొందించుకుని భవిష్యత్‌లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ పట్టేటి రాజశేఖర్ అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో గురువారం ఇంగ్లిష్ భాషలు–సాహిత్యంలో ప్రధాన సమస్యల అంశంపై అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ ప్రపంచం అన్ని రంగాల్లో దూసుకుపోతున్న తరుణంలో ఇంగ్లిష్ భాషకు ఆదరణ పెరుగుతోందన్నారు. అన్ని రంగాల్లో ఇంగ్లిష్ భాష అనివార్యమైందని తెలిపారు. ఇంగ్లిష్‌లోని రచనలు తెలుగు లేదా ఇతర భాషల్లో అనువదిస్తున్నారని పేర్కొన్నారు. ఆంగ్లభాషపై పట్టు సాధించినపుడే అనువాదాలు సాధ్యమవుతాయని తెలిపారు. విద్యార్థులు మాతృభాషను మరవకుండా ఆంగ్లంపై పట్టు సాధించాలని వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ ఫాదర్ సహాయరాజ్, ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, అధ్యాపకులు శ్రీకుమార్, సహాయ భాస్కరన్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విభాగాధిపతికి కెప్టెన్ ర్యాంకు



పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్‌సీసీ విభాగాధిపతి లెఫ్టినెంట్ కానుగుల సత్యనారాయణ కెప్టెన్ ర్యాంకు పొందారు. కాలేజీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 1(ఎ)ఈఎంఈ కాయ్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సంజయ్ తన్వర్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి కెప్టెన్ ర్యాంకును సత్యనారాయణకు ప్రదానం చేశారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరగా భూముల సరిహద్దు రాళ్లు పాతండి

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రీ సర్వే చేసిన భూముల్లో సరిహద్దు రాళ్లు పాతే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకంలో భాగంగా చేపడుతున్న భూముల రీసర్వేలో సరిహద్దు రాళ్లు పాతే ప్రక్రియపై గురువారం జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు సర్వేయర్లతో కలెక్టర్ ఢిల్లీరావు గూగుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 14 గ్రామాల్లో భూముల రీసర్వే ప్రక్రియను చేపట్టి పూర్తి చేస్తారన్నారు. రీ సర్వేలో భాగంగా సరిహద్దు రాళ్లు పాతే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. జగ్గయ్యపేట మండలం షేర్ మహమ్మద్ పేట గ్రామంలో సరిహద్దురాళ్లు పాతడం పూర్తైందన్నారు. మిగిలిన 13 గ్రామాల్లో భూముల సరిహద్దు రాళ్లు పాతాల్సి ఉందన్నారు. ఇప్పటికే సిద్ధంగా ఉన్న 23 వేల సరిహద్దు రాళ్లను ఆరు వారాల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు.

మాతృభాషను పరిరక్షించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచభాషల్లో గొప్ప పదసంపద కలిగిన తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డాక్టర్ సామల రమేష్ బాబు అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తెలుగు విభాగం ఆధ్వర్యాన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకుని 'మాతృభాష – శాస్త్రీయ అధ్యయనం – సాంకేతిక అవసరాలు' అనే అంశంపై ప్రసంగం కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ మాతృభాషలో ప్రావీణ్యం పొందినప్పుడే పరాయి భాషలను సులువుగా నేర్చుకోగలరని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తల్లి ప్రేమలా మాతృభాష కూడా తియ్యనైనదని, తెలుగువారు ఎక్కడ ఎదురుపడినా తెలుగులోనే సంభాషించుకోవాలన్నారు. కార్యక్రమానికి తెలుగు విభాగాధిపతి డాక్టర్ వై. శ్రీలత సమన్వయ కర్తగా వ్యవహరించారు. తెలుగు అధ్యాపకులు పీజీ సమన్వయకర్త డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్ మాతృభాష పరిరక్షణలో విద్యార్థుల పాత్రను తెలియ చేశారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగం అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

1.40 లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలోని ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక ఇంట్లో ఈ నెల 14వ తేదీన జరిగిన చోరీ కేసులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యల్లాప్రగడ సత్యనారాయణ కొరియర్ ఆఫీస్‌లో గుమాస్తా. అతను భార్య రమాదేవితో కలసి పూర్ణానంపేటలో నివాసిస్తున్నారు. వారు ఈ నెల 14న రాత్రి 7 గంటలకు ఇంటికి తాళం వేసి దేవాలయానికి వెళ్లారు. తిరిగి 8.30 గంటలకు రాగా ఇంటి తాళాలు పగలకొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం తెరచి ఉంది. అందులో ఉండాల్సిన బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. దీనిపై పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో పూర్ణానందంపేట, లక్ష్మణరావువీధిలో నివసించే ధూపాటి వెంకటకృష్ణ అలియాస్ కృష్ణ(29) నేరానికి పాల్పడినట్లు నిర్ధారించుకున్నారు. గురువారం నిందితుడు కాళేశ్వరరావు మార్కెట్ వద్ద చోరీ సొత్తు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 1.40 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

19న ఇఫ్టూ నగరశాఖ మహాసభ



ఇఫ్టూ మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నేతలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) విజయవాడ నగర శాఖ ఐదో మహాసభ ఈ నెల19వ తేదీన బాలోత్సవ భవనంలో జరుగుతుందని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. గురువారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో ఇఫ్టూ నగర శాఖ ఐదో మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇఫ్టూ నగర అధ్యక్షుడు కె. రవీంద్ర, ఆర్.కనకరావు, నాని, టి. శ్రీను, సురేష్ ఎన్. శ్రీను, సలీం, బెనర్జీ, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): మత్తు పదార్థాలకు బానిసలై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ జె.ఆంజనేయులు విద్యార్థులకు సూచించారు. కృష్ణలంకలోని శ్రీ పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ పాఠశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యాన గురువారం ఆయన మత్తు పదార్థాలు దుర్వినియోగంపై ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆంజనేయులు మాట్లాడుతూ తాత్కాలిక సంతోషానికి విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసలై దీర్ఘకాలిక సంతోషాన్ని వదులుకుంటున్నారన్నారు. మత్తుకు బానిసలైన వారిని డీ–ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చన్నారు. వ్యసనానికి బానిసలైన విద్యార్థులు, యువతకు విముక్తి కలిగించేందుకు డాన్ బాస్కో నవ జీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో పెజ్జోనిపేటలో ఏర్పాటు చేసిన సీతోడు మానసిక వికాస కేంద్రాన్ని ఉచితంగా సంప్రదించవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 94904 92020 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్స్ జె.వాణి, పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

130 మంది వృద్ధులకు కంటి పరీక్షలు

కంకిపాడు: కంటి సంరక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ సూచించారు. ఉప్పలూరు పీహెచ్‌సీలో గురువారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగులో 130 మంది వృద్ధులకు పరీక్షలు చేశారు.